

# మూడో మనిషి

"నమస్కారం!"

ఏదో ఆలోచిస్తూ బయటికెళ్లబోతూ చెప్పులేసు కుంటున్న నేను తలెత్తి చూశాను.

గుమ్మంలో మల్లేశం! ఎప్పటిలాగే అతికించుకున్న చిర్నవ్వుతో.

"ఓ!మీరా? రండి!రండి!" సాదరంగా ఆహ్వానించాను.

"మీ పని చెడగొట్టలేదు గదా!" సంజాయిషీ కోటింగ్ ఇచ్చాడు.

"అబ్బే! ఊరికే, కాలక్షేపానికే!" కారణం యాథాలాపంగా చెబుతూ చతికిల బడ్డాన్నేను. తనూ కూర్చున్నాడు ఎదురుగా కుర్చీలో.

మల్లేశం మంచి మనిషే. ఎవ్వరికీ అపాయం చేయడమెరుగను; పక్క వీధిలోనే ఇల్లు (సొంతం); చిన్న కుటుంబం; ప్రభుత్వోద్యోగం; మనిషెప్పుడూ ఆరోగ్యంగా కనిపిస్తాడు.

" ఊఁ! ఏవిఁటి సంగతులూ!"

"నేనేం చెప్పగల్ను?" అన్నట్లు నేను.

ఇంతలో మా ఆవిడ టీ పట్టుకొచ్చింది.

''రామారావు సంగతి విన్నారా?'' టీ సిప్ చేస్తూ మల్లేశం.

''ఏమైంది పాపం!'' (''బానే ఉన్నాడుగా'' అనే శ్లేషలో నేను).

''అయ్యో! మీకు తెలీదా! మళ్ళీ పెళ్ళిచేసుకుంటున్నాడటండీ!''.

టీ ఒలికిపోకుండా పట్టుకోవడం గగనమైంది.

'వెధవ! ఇలాంటి సంగతులింత హఠాత్తుగా జెబుతాడేంటి?'

'జోకా'? నిజంగా నమ్మశక్యంగా లేదు నాకు.

''అయ్యోరామా! అందుకే మీరిలా ఉన్నారు!'' నా అమాయకత్వంపై సానుభూతి చిలకరింపాహటి.

'' ఎదుగుతున్న వాడ్ని చూస్తే ఎవ్వడికైనా కుళ్ళే. ఏదో ఓ కారణం దుమ్మెత్తి పోయడానికి. అసలెవరు చెప్పారు మీతో?'' ఆశ్చర్యం, కోపం కలగాపులగం-నాగొంతులో.

''ఎవరో చెప్పడమేంటండీ, మా ఆవిడకు వాళ్ళావిడ చాలా క్లోజు. విడాకులిచ్చెయ్యమని ఒహటే పోరట. ఆ మహా సాధ్వి కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నది పాపం!''

టీ తాగలేకపోయాను.

నా మొహంలో ఏ సంపద దొరికిందో, ఆనందంతోవెలిగిపోతుంది మల్లేశం వదనం.

''కాస్త వివరంగా చెప్పండి!''చేదుమాత్ర మింగినట్లు నేను.

''ఏంటి చెప్పేది? చాలా భయంకరంగా వుంది వాళ్ల స్టూడెంట్‌నేనట ఆయనగారు పెళ్ళి చేసుకోబోయేది'' మరో బాంబు పేల్చాడు.

''అసలేం జరిగిందో చెప్పండి!'' వినబోయే విషయానికి మానసికంగా సంసిద్ధమౌతూ అడిగాను.

''ఆయన ఫిజికల్ సైన్స్‌లో జీనియస్ కదా! బోల్డు ట్యూషన్లు. అలా తారసపడ్డదే ఆ అమ్మాయి. ఏదో 'హలో'అంటే 'హాలో' అన్నట్లు లింకు కుదిరుంటుంది. ఓ శుభమూహూర్తాన వాళ్ళావిడ లేంది చూసి...''

''ఆపండాపండి'' ఆపై వినలేక పోయాను. అయినా ఇంత చీప్‌గా మాట్లాడ్తాడేమిటి వీడు. ''అయినా ఆ పిల్లకు బుద్ధుండక్కర్లా!'' రామారావు పట్ల అంతటి అభియోగాన్ని భరించలేకపోతున్నాను.

''వయసండీ వయస్సు! వయసు వేడి, అవకాశం వాడి ఎలా తట్టుకుంటారు? అవకాశాల్లేక చాలామంది బుద్ధి మంతులుగా ముద్దర్లేయించుకుంటున్నారు.''వృద్ధనారీ పతివ్రతా'' అన్నట్లు

'పైగా సూక్తులొహటి వీడి మొహానికి' అనుకుంటూ అసహనంగా కదిలాను.

'పాపం ఎంతకాలం దాగుతుంది? మూణ్ణెల్లకే బయటపడింది రంగు. తల్లీదండ్రీ నిలదీస్తే అసలు సంగతి కక్కేసిందాపిల్ల. ఇంకేం, మనవాడ్ని ఎటాక్ చేశారు. గొడవ పడితే పరువు పోతుందని నిజమొప్పుకున్నాట్ట మహాశయుడు. దాని ఫలితమే మొదటి పెళ్లి పెటాకులు, రెండో దానింట మావిడాకులు'' తాను చెప్పాల్సిందైె పోయినట్లుగా నిట్టూర్పు విడిచాడు నింపాదిగా.

★ ★ ★

''మన జూనియర్ అసిస్టెంట్ గురించి నీ అభిప్రాయమేంటి గురూ!''సాయంత్రం గుల్మార్గ్ హోటల్లో మిరపకాయ బజ్జీలు లాగిస్తుంటే ప్రస్తావించాడు వెంకటేశం.

''కుర్రాడు చురుకైనోడు; పని నేర్చుకోవాలనే జిజ్ఞాసగలవాడు; ఒళ్లొంచి పనిచేస్తాడు; పైకొస్తాడు'', ఆలోచిస్తూ ఒక్కో గుణాన్ని విశ్లేషించాన్నేను.

'' ఇంకా?'' అన్నాడు సూటిగా చూస్తూ.

కుర్రాడు గదా! కాస్త లేటేస్ట్ గా ఉండేందుకు తాపత్రయ పడ్తుంటాడు'' అన్నాను గుర్తుకు తెచ్చుకుంటున్నట్లు.

నీకేం తెలీదు గరూ! ఆ పైళ్లూ, ఈ కళ్లజోడు లేకుండా ఎప్పుడైనా నీ చుట్టూ పరిశీలించి చూడ్డం తెలుసుకో!'' సానుభూతో, మందలింపో అర్థంకాలేదు.

మిరపకాయ కూడా తొడిమను నమిలుతున్నట్టుందినా స్థితి.

''వాడంతకు మించిన ఘటికుడయ్యా!'' శృతి పెంచి, వాల్యూమ్ తగ్గిస్తూ........ వెంకటేశం.

''సర్లెండి! వాడి పర్సనల్ వ్యవహారాల్తో మనకేంటి పని?'' ఏదో గ్రంథం తిరగేస్తాడేమోనని భయమేస్తుంది నాకు.

'' పర్సనలైతే నేను పట్టించుకుంటానా ? మన ఆఫీసుతో సంబంధం వుంది. పెద్దాడివి, నీకు చెబితే ఏదో బుద్ధి చెబుతావనేగా!'' ''అడ్డమైన సంగతులు జెప్పే వెధవనుగాను' అన్న ధోరణిలో వెంకటేశం.

పురాణశ్రవణం తప్పేట్టు లేదు. ' ఏం జరిగింది?'' వినక ఛస్తావా?

మొహంలో మొహం పెట్టి రహస్యంగా చెప్పాడు. మన ఎమ్.పి.డి. ఒ.తో వాడికి సమ్మంధముందండీ!''

నా చేయి తగిలి గ్లాసు పడిపోయింది. నీళ్లొలికాయి నాపై.

'ఛ! నోర్మయ్!' బజ్జీగాక సొంతం మిరపకాయనే నమిలేసినట్లైంది.

''మీరిలా అంటారని తెలుసు'' అన్నాడు నా స్వభావానికి ముద్రేస్తూ.

''వాడ్నంటే అన్నారు. ఎమ్.పి.డి. ఓ. గారి గురించి మీకు తెలీదా? ఆవిడెంత డిసిప్లిన్‌గా ఉంటారు. పైగా పెళ్లయింది. పిల్లలు కూడా!'' నాకు తెలీకుండానే ఆవేశం, ఆవేదనా నన్నూపేసాయి.

''మరదే మీతో వచ్చిన చిక్కు. ఈ విషయం ఎప్పుడో టౌనంతా పాకింది. ఈరోజుదయం ఎమ్. ఆర్. ఓ. ఆఫీసుకెళ్తే సీనియరసిస్టెంట్ సీనాచారి చెప్పాడు'' 'నువ్వింత వెనకబడి ఉన్నావేం?' అన్న వక్రోక్తి-స్పష్టంగా తెలుస్తోంది.

''నాతో అంటే అన్నారుగానీ, ఇంకెక్కడా పేలకండి!'' నిర్మోహమాటంగా అనేశాన్నేను.

''అరె, అలా ఇదయిపోతారేంటండీ? ఆధారాల్తో జెబుతున్నారు. అర్థ రాత్రిపూట ఆవిడగారు, మొగుడు లేనప్పుడు తన ఇంటికి వీడ్ని పిలిపించుకోవడం...''ఆ తర్వాత వినలేక కౌంటర్‌లో డబ్బులు చెల్లించి, బయటికొచ్చి సైకిలెక్కాను.

★ ★ ★

గ్రీష్మానికి వర్షానికీ సంధికాలం; కరెంటు లేదు; వర్షంరాదు; ఉక్కపోత ఆగదు; ఇది భరించలేక డాబా మీద పచార్లు చేస్తున్నాను.

''ఆ రాజారావు సంగతి నీకేమి తెలీదు. నువ్వు నోర్మూసుకో'' మెల్లగానే అన్నా, నిశ్శబ్ద వాతావరణంలో స్పష్టంగా వినిపిస్తున్నాయా మాటలు. నాపేరు వినిపించే సరికి ఠక్కున ఆగిపోయాను. నాప్రమేయం లేకుండా శ్రవణేంద్రియాలు తమ కర్తవ్యాన్ని నిర్వహించసాగాయి. పక్కింటి ప్రమీలా వాళ్లాయన సుందరయ్యా వరండాలో వాదులాడుకుంటున్నారు....

''ఎందుకలా మాట్లాడతారు? పెద్దాళ్లమీద అభాండాలేస్తే కళ్ళూ పోతాయ్!'' నిష్ఠూరం నిండిన గొంతు ప్రమీల.

''వాడు పెద్దాడేమిటినీ మొహం! పైకి అలా చాలా అమాయకంగా కనిపిస్తాడు. వాడో సైకోపాథ్!'' సుందరయ్య.

''అంటే'' బొమ్మలు ముడేసి వుండవచ్చామె.

''అంటే నీకర్థం గాదులే. అదో మానసికమైన జబ్బు. పైకి మాత్రం ఉత్తములుగా చలామణీ అవుతుంటారు. కాని, మనసులో భయంకరమైన ఆలోచనలుంటాయన్నమాట. అవకాశాన్ని బట్టి అవి రాక్షసంగా నెరవేర్చు కుంటూంటారు'' పెద్ద సైకాలజిస్ట్‌లా విశ్లేషించాడు.

''మీరెన్నయినా చెప్పండి! రాజా రావన్నయ్యలో ఏ మానసిక జబ్బాలూ లేవు'' తేలిగ్గా తీసిపారేసింది ప్రమీల.

''నువ్వు నమ్మవనే గదా చెప్పంది'' సుందరయ్య.

''ఇంత ఇదే వుంటే వదినె నాకెప్పుడో చెప్పేది'' ప్రమీల.

''ఆడాళ్లట్టాంటి విషయాలు చెప్పుకుంటారుటే?'' ఆయన లోకజ్ఞానం.

''మేమైతే అన్నీ చెప్పుకుంటాం. ఆవకాయ దగ్గర్నుండి అటల్‌బిహారీ వాజ్‌పాయ్ దాకా మాట్లాడుకుంటాం'' ఆమె ధోరణి మారలేదు.

''అది వేరూ - ఇది వేరూనూ'' ఆయన వాదన.

''అయితే ఏంటంటారు? అన్నయ్య వాళ్ళావిడ్ని హింసిస్తున్నాడనేనా?'' పోరు భరించలేక అడిగింది.

''మామూలు హింసకాదే పిచ్చి మొహమా! వాడో శాడిస్టు! అయినా పొద్దు గూకగానే గుర్రుపెట్టే నీకేం తెలుస్తుంది. అర్ధరాత్రి పూట వింటే తెలుస్తుంది పక్కింట్లో బాగోతం...'' ఏదేదో వర్ణించి చెప్పుకుపోతున్నాడు.

మొట్టమొదటిసారి నాకీ సమాజం మీద జాలి కలిగింది.

★ ★ ★

రాత్రి పదకొండు దాటిందనుకుంటా.

రోజూ పదిగాకుండానే నిద్రపోయే నేను, వేళ మించిపోయినా పక్కమీద దొర్లుతుండటం గమనించినట్లుంది శ్రీమతి.

''ఏవండీ! నిద్దర్రావట్లేదా?'' తీయని మందలింపు.

సుమతి తీరే అంత. ఇరవైయ్యేళ్ల మా వైవాహిక జీవితంలో ఆమె మాటల్లో కోపం, చిరాకు గమనించిన సందర్భాలు వేళ్లమీద లెక్కబెట్టుకోవచ్చు. అదయినా నాకేదో ఇబ్బంది గల్గుతున్నప్పుడో, అనవసరమైన చిక్కులో పడిపోతా ననుకున్నప్పుడో! ఆ అమృతమూర్తితో నా అనుబంధాన్ని ఎంత నీచంగా చిత్రించాడు వెధవ! ఛ ఛ!...

తలచుకోగానే కళ్లు చెమర్చాయి.

'' ఏవండీ!'' వెనుక నుండి జబ్బ పట్టుకొని కుదిపింది.

''ఏమీ లేదోయ్! కాస్త తలనొప్పిగా ఉంటేనూ!...'' నా ప్రయత్నం కంఠంలోని రుద్ధతను అధిగమించ లేకపోయింది.

'' ఏదీ! ఇటు తిరగండి!''

తిరగలేక తప్పలేదు.

సూటిగా కళ్లలోకి చూసింది.

దొరికిపోయాను.

మనసులోని ఆవేదనను కెలికి-కెలికి అడగదు ఎప్పుడూ.

కారణం అడగలేదు. ఆప్యాయంగా కౌగిలించుకుంది. హృదయకుహరాన్ని కదిలించిన ఆ పరిష్వంగంలో సర్వం మరిచాను. సంతోష సంకేతంగా నుదుటిని చుంబించాను.

''ప్రమీలొదిన ఉత్త అమాయకురాలండీ!'' మెల్లగా నారూటు మార్చే ప్రయత్నంగాబోలు.

అర్థ రహితంగా మొహంలోకి చూశాను.

''సుందరయ్యన్నయ్య ఎప్పుడూ ఏదో ఒక రకంగా హింసిస్తూనే ఉంటాట్ట. పాపం!''

అంతసేపూ నన్నావరించిన ఆనందం ఆవిరైపోతుంటే ''ఏం జరిగింది?'' అనక తప్పలేదు.

'' ఆ! ఏవుందీ, రోజూ తాగి ఆలస్యంగా ఇంటికి వస్తున్నారట. అది చేసి పెట్టూ, ఇదిచేసి పెట్టూ అంటూ ఒహటే వేధింపు. ఈ మధ్య స్నేహితుల్ని కూడా వెంట బెట్టుకొచ్చి తాగుతూ, పేకాడుతూ ఏదోదో హంగామా చేస్తూన్నాట్ట ఇరుగింటి శ్రీలక్ష్మి చెప్పింది. దానికి వాళ్లాయన చెప్పాట్ట...'' ఇంకా చెబుతూనే ఉంది.

నిద్ర నటించసాగాను, వినలేక.

నిజంగానే నిద్రపోతున్నాననుకున్నట్టుంది. నుదుటి మీద ఆర్తిగా ముద్దుపెట్టుకుని, మరికాస్సేపట్లో నిద్రలోని జారుకుంది.

నాకు మాత్రం ప్రతి ఇద్దరు వ్యక్తులు మూడో మనిషి'' లోని చెడును గురించే ఎక్కువగా ఎందుకు మాట్లాడుకుంటారో''నని ఆలోచిస్తుంటే చాలాసేపటివరకు నిద్రే రాలేదు.

*(జాగృతి 1–7మార్చి '99 వారపత్రిక)*